# స్వంత ఇంటి కష్టం

టి.పి. లక్ష్మి

**మనం కూడా ఇల్లు కట్టుకుందామండీ'' అన్నాను ఒకరోజు ఉదయాన్నే కాఫీ కప్పు అందిస్తూ.**

**పేపరు చదవడంలో లీనమైనాయనల్లా ఒక్కసారి ఉలిక్కిపడి నావైపు కోపంగా చూసి మళ్లీ పేపరు చదవడం ప్రారంభిస్తూ నా చేతిలోని కాఫీ కప్పు తీసుకుని తాగుతూ మధ్యలో ఒకసారి నీ పనయ్యింది, ఇక వెళ్ళచ్చు అన్నట్లు నావైపు చూశారు. అయినా నేను కదలలేదు.**

నర్మద గుర్తుకు వచ్చింది. నర్మద భర్త శాయి. మావారి దగ్గర అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. మా కళ్లెదుట అంచెలంచెలుగా ఎదిగిపోయాడు, స్వంత ఇల్లు కట్టుకొని. మేము మాత్రం గొర్రెతోక బెత్తెడు అన్నట్లు ఇంకా అద్దెకొంపలోనే వుంటున్నాము. నర్మదా వాళ్లు ఎప్పుడూ నాలుగు వందలలోనే అద్దె ఇల్లు చూసుకునేవారు. మేము మాత్రం రెండు వేలు అద్దె. పైన కరెంటు ఖర్చూ ఎక్కువే అయ్యేది. ఫ్యాన్లు, గీజరు, ఫ్రిజ్, కూలరు. ఇలా వగైరా వగైరా అధిక ఖర్చుతో గడిపేస్తున్నాము. కొత్త ఇల్లు, కొత్త ఫర్నిచరుతో వాళ్ళ ఇల్లు చూస్తే కడుపు నిండినట్లయింది నాకు. అంతకుముందు ఒక బిందె, ఒక స్టవ్, రెండు కంచాలు, ఒక చాప, రెండు దుప్పట్లు. ఇలా జాగ్రత్తపడి పొదుపు చేసి ఇప్పుడు ఎంతో ఎత్తుకెదిగిపోయారు. నా బుర్రలో దొలుస్తున్న ఆలోచనల నుంచి బయటపడ్డాను. ఏమైనా సరే స్వంత ఇల్లు కట్టుకోవాలన్న పట్టుదల, వాళ్ళకంటే ఒక అంతస్తు ఎక్కువే వెయ్యాలన్న కోరిక ఇవన్నీ నన్ను చుట్టుముడుతున్నాయి.

"మిమ్మల్నే, మనం కూడా ఇల్లు కట్టుకుందామండీ'' అన్నాను, విక్రమార్కుడి చెల్లిలా!

"నన్ను సాధిస్తావేంటే బాబూ'' అన్నారు చికాగ్గా, అక్కడికి నేనేదో అనకూడని మాటలంటున్నట్లుగా నావైపు చూస్తూ...

"అదికాదండి మనం..'' నా మాట పూర్తికానివ్వకుండా

"ఇల్లు కట్టుకోవలసినంత తొందర దేనికి?'' అన్నారు, విసుగ్గా ముఖకవళికలు మార్చేస్తూ.

"ఏం మనం ఇల్లు కట్టుకోకూడదా? అలా అని ఏ సిద్ధాంతి చెప్పాడు. అయినా మీకూ రిటైర్మెంటు దగ్గరపడుతోంది. ఇంకా అద్దె ఇంటికోసం తిరగడం శ్రమ కాదా? మనం నీళ్ళకి చాలా ఇబ్బంది పడుతున్నాం. ఆ ట్యాంకరు వచ్చేముందే క్యూలో నిలబడలేక ఆ నీళ్ళు పట్టుకునేవరకు నానా అవస్థలు పడుతున్నాను. తలచుకుంటేనే భయంగా వుంది. నాకిక ఓపిక లేదు'' అంటూ నేను పడే బాధలు ఏకరువుపెట్టాను.

దానికి సమాధానంగా ఆయన – "నీకీ యిల్లు నచ్చకపోతే చెప్పు ఇంకొక రెండు వందలు వేసి వేరే మంచి యిల్లు చూస్తాను'' అన్నారు మొండిగా.

"అద్దె ఇంటికోసం తిరిగే ఓపిక మీకుందేమోగానీ, సామాను పేక్ చెయ్యడం, మళ్ళీ ప్యాకింగ్ విప్పి కొత్తింట్లో సర్దడం, అన్నీ నేనే చూసుకోవాలి. మీకంటే ఎక్కువ శ్రమపడేది నేనే. మీకేం ఎన్నైనా చెబుతారు. ఉన్న ఓపిక కాస్తా ఖర్చు చేసుకుంటే రేపు మనమ్మాయి పెళ్ళికి పనులు చేసే ఓపిక లేక ఓ మూలన పడితే మనకి సాయం చేసేది ఎవరు? అందరూ ఆ టైముకి వచ్చి వెళ్ళిపోయేవారే'' అన్నాను కోపంగా. ఏది చెప్పినా ఒప్పుకోరు సరి కదా? దానికి చిలవలూ, పలవలూ మాత్రం చక్కగా అద్దినట్లు చెబుతారు.

"అయినా ఇల్లు కట్టడం అంటే పిచ్చుక గూడో, బొమ్మరిల్లో కట్టడం అనుకున్నావా?'' కోపంగా చేతిలోని పేపరు విసిరేసి గబగబా వెళ్ళిపోయారు. ఈరోజుకీ క్లాస్ చాలనుకున్నాను.

* * *

ఒక నెల తరువాత అదే టాపిక్ తేవడం , మా అమ్మాయి శ్రావ్య నాకు సపోర్టు ఇవ్వడంతో ఇంటి కోసం పోరు మరింత ఉధృతం చేశాను. ఏ టాపిక్ వచ్చినా సరే భూమి గుండ్రంగా వుంటుందన్నట్లు తిప్పి, తిప్పి మళ్ళీ ఇంటి గురించి చర్చించేదాన్ని. నా పోరు పడలేక మా అమ్మాయి పెళ్ళికి కట్నంగా ఇద్దామని దాచిన డబ్బుతో గాజువాకలో ఇల్లు కట్టడం మొదలుపెట్టారు. ముందుగా బోర్‌వెల్ వేయించాము. నీరు పుష్కలంగా పడింది. నా మనసు కుదుటపడింది. హమ్మయ్య నీటి బెడద లేదు అనుకున్నాను. ఇక ఇంటి గురించి అన్ని జాగ్రత్తలూ చెప్పారు. పై పోర్షన్‌లో మనముందాము.





క్రింది పోర్షన్ అద్దెకిస్తాను. ఎప్పటికప్పుడు ఇంటిని శుభ్రం చెయ్యాలని. పనివాళ్ళకు భోజనం, టిఫిన్, టీ నన్నే తయారు చెయ్యమన్నారు, ఖర్చు తక్కువగా అవుతుందన్న చిన్న ఆలోచనతో. మా వారి తోబుట్టువులు, నా తోబుట్టువుల కంటే ముందుగా మేమే ఇల్లు కడుతున్నామన్న సరదా ఒకపక్క, నర్మదా వాళ్ళకంటే ఒక అంతస్థు ఎక్కువ వేస్తున్నామన్న ఆనందం ఒకపక్క. అందుకే మావా



రేది చెప్పినా తలాడించేశాను. ఒక హాలు, రెండు బెడ్‌రూములు, దేవుడి గది, కిచెన్, డైనింగ్ హాలు, ముందువైపు బాల్కనీ చాలనుకున్నాము. నేను ఇంట్లో పనులతోను, ఆయన ఇంటికి కావలసిన మెటీరియల్ తేవడంలోనూ బాగా అలిసిపోయాము. మొత్తానికి గృహప్రవేశం చాలా గ్రాండ్‌గా జరిపించేశాము. ఇక ఇల్లు సర్దుకునేసరికి నెల రోజులు పట్టింది. ఇక హాయిగా సుఖపడవచ్చనుకున్నాను.

అంతే ఒకరోజు మినీ లారీ వచ్చి ఆగింది. లారీ నిండా సామాను. లారీ డ్రైవరు ఒక చీటీ నా చేతికిచ్చాడు. మా అత్తగారు రాసిన చీటి. ఆవిడ కాపురానికి వచ్చినప్పుడు ఆవిడ పుట్టింటివాళ్ళు ఇచ్చిన సామానట. ఆవిడుండే అద్దె ఇంట్లో సరిపోవడం లేదని మా ఇంటికి పంపింది. ఈ సామానంతా అటకమీద పడేయమంది. సామానుదించుతుంటే చిల్లుపడిన గుండిగలు, విరిగిపోయిన టేబుల్, కుర్చీలు, చిన్నసైజు బోషాణం లాంటి కొయ్యపెట్టె, రోలు, రోకళ్లు, రుబ్బురోలు, కొయ్యపెట్టె నిండా చీపుళ్లు, చాటలు, అట్టలు. ఇంకా ఏవేవో బోలెడు సరంజామా వుంది. సామానంతా సర్దేసరికి ఇల్లు సగం నిండిపోయింది.

ఇది జరిగిన రెండు రోజులకు మా ఆడపడుచు నుండి ఫోన్. మా అమ్మాయిని డెలివరీకి తీసుకువచ్చాను. మాది పల్లెటూరు కదా? డాక్టరు సదుపాయం లేదు. మీ ఇంటికి రమ్మంటావా? అనడిగింది. మావారు ఆనందంగా రమ్మని పిలిచారు. అంతే మరునాడే మా ఆడపడుచు, భర్త, వాళ్ళమ్మాయి దిగారు. శ్రావ్య రూము వాళ్ళకిచ్చేశాము. శ్రావ్యకి ఇంట్లో చదువుకోవడం కొద్దిగా ఇబ్బందిగా వుండి ఫ్రెండింటికి వెళ్ళి చదువుకునేది. ఇక వీళ్ళు వచ్చిన దగ్గర నుండి తలుపులేసుకుని గదిలో ఒకటే గుసగుసలు వినిపించేవి. కాఫీ, టిఫిన్ గదిలోనే కానిచ్చేసేవారు. మా ఆడపడుచు కూతురు అస్తమానం వాళ్లాయనతో ఫోన్‌లో మాట్లాడుతూనే వుండేది. ఈ ఫోన్‌కి రెస్ట్ వుండదేమో నాలాగే అను





## కురుల సింగారం

వయసు పద్దెనిమిది.. వలపు పదునైనది. ఉత్సాహం ఉరకలేసింది.. ఆనందం ఊపునిచ్చింది. అన్ని కళలనూ ఒక్కసారే మేళవించుకుని ఓ మోడలింగు బొమ్మ కురుల సింగారాన్ని కులుకుతూ ఒలకబోసింది. ఆస్ట్రేలియా దేశంలోని సిడ్నీ మహానగరంలో జరిగిన ఎక్స్‌పో ప్రదర్శనకు ఓ చిత్రమైన హెయిర్ స్టైల్‌తో వచ్చిన ఈ సుందరాంగి పేరు లియా కెల్లోగ్రిడ్స్. చక్కటి పలువరుస.. చూడచక్కని ఎద సంపదలు కురుల సింగారానికి తోడై.. కుర్రకారును మత్తెక్కించాయి. మళ్లీ మళ్లీ చూడాలనిపించిన ఈ వలపుల రాణి.. ప్రోగ్రాం ముగిసిన వెంటనే మెరుపుతీగలా మాయమైంది.

కునేదాన్ని. ఇక ఆదివారం వస్తే చాలు. మా ఆడపడుచు అల్లుడొచ్చేవాడు. అతనికి ఇష్టమైనవన్నీ చేసిపెట్టమని మావారి ఆర్డరు. అల్లుడు కదా? మర్యాద లెక్కువే చెయ్యాలి. నా జీవితం వంటింటికే అంకితమయిపోయింది అనిపించింది. వీళ్లిద్దరూ మావారు వచ్చాక ఒకటే వేళాకోళాలు, నవ్వులు. పనుల వత్తిడి వల్ల నేనూ మావారూ సినిమాకెళ్లే అవకాశమే దొరికేది కాదు. ఇక మా అమ్మాయి, అమ్మా నన్ను హాస్టల్‌లో జాయిన్ చేసెయ్యమని ఒకటే పోరు. ఈ విషయం మావారితో అంటే ఇప్పటికే ఖర్చులధికమయ్యాయి, నావల్ల కాదు అని ఖచ్చితంగా చెప్పేశారు. నెల తరువాత వీళ్ళు వెళ్ళిపోతారని మా అమ్మాయికి సర్దిచెప్పేదాన్ని. బాబు పుట్టి బారసాల అయ్యాక ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. బారసాల ఖర్చులడగలేము కదా? ఆ ఖర్చు కూడా మావంతయింది. ఇక బ్యాంక్‌లో డబ్బంతా అయిపోయింది. వాళ్ళు వెళ్ళి రెండురోజులు అయిందో లేదో మా బావగారబ్బాయి ఇంటర్ పరీక్షలు రాయడానికి వచ్చాడు. అక్కడ వాళ్ళకి రాత్రిపూట కరెంటు వుండడం లేదట. అందుకని రెండు నెలల తరువాత పరీక్షలనగా ముందుగానే వచ్చి కూర్చున్నాడు. మళ్ళీ స్టడీ రూమ్ అతనికిచ్చేశాము. రెండు నెలలపైనే వున్నాడు. నాకు కోపం ముంచుకొచ్చింది. ఆఖరికి మా ఇల్లు ఒక సత్రంలా తయారయిందనిపించింది.

ఇక చుట్టుప్రక్కల వాళ్ళందరూ మంచినీళ్ళ కోసం ఒక్కొక్కరూ ఒకొక్క బిందంటూ వచ్చేవారు. జాలి తలచి నీళ్ళిచ్చినందుకు ఆ నెల కరెంటు బిల్లు ఎనిమిది వేలు. మాకు గుండె ఆగినంత పనయింది. జీతంతోపాటు ఓటీలు కూడా కలిపినా పైన అప్పు చేస్తేకానీ సరిపోయేది కాదు. వచ్చిన జీతం మూడు నిమిషాలలో అయిపోయేది. వారం తరువాత మా అత్తగారి నుండి ఫోన్ వచ్చింది. ఆమె మా ఇంట్లో వుంటుందట – అద్దె ఇల్లు ఖాళీ చేశాను అని చెప్పింది. అత్తగారు కదా? తప్పదు ఎప్పుడైనా మా దగ్గర వుండవలసిన మనిషే కదా? అని అలాగే రమ్మన్నాను. ఈ ఫోన్ వచ్చిన పది నిమిషాలకు మా పెద్దత్తగారి నుండి ఫోన్. వాళ్ళమ్మాయికి పెళ్ళి చూపులు, అదీ మా ఇంట్లో జరగాలిట. ఆవిడ ఆర్డరు. మేమైతే మర్యాదలు ఘనంగా జరుపుతామన్న పొగడ్త ఒకటి. అంటే ఇన్‌డైరెక్ట్‌గా మర్యాదలు బాగా జరపమని చెప్పేసినట్లుగా.... ఈ ఫోన్‌కాల్స్ వల్ల నాకు, మావారికి మతిపోయినట్లయింది.

''ఈ ఇల్లు మాకు తలనెప్పిగా తయారయింది. ఈ బంధువుల్ని మేపడానికి అప్పిచ్చేవాళ్ళే కనబడడం లేదే'' అంటూ తలపట్టుకున్నారు మావారు. బంధువుల్ని రావద్దనీ చెప్పలేము, వస్తే భరించే శక్తీ మాకు లేదు. ఇద్దరం మతిలేని వాళ్ళలా కూర్చున్నాము. మళ్లీ ఫోన్ రింగ్. నాకూ, మావారికీ ఆ ఫోన్ ఒక భూతంలా కనిపించింది. మా మరిది గారినుండి. వాళ్ళ ఇంటావిడ చనిపోయిందట. ఇల్లంతా వాళ్లకి కావాలట. అక్కడ ఒక రూములో సామానంతా పడేసి ఒక వారంపాటు మా ఇంట్లో వుంటామని అడిగారు. మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టయింది మా పరిస్థితి. మావారు ముభావంగా ఆఫీసుకు వెళ్ళిపోయారు. ఆరోజు సాయంత్రం సంతోషంగా వచ్చారు. ఆయన ముఖంలో సంతోషం ఇన్నాళ్ళకు చూశాను.

''ఏమేవ్ నాకు విజయవాడకి ట్రాన్స్‌ఫర్ అయింది. ఎల్లుండి జాయిన్ అవ్వాలి. రేపు సాయంత్రానికే బయలుదేరాలి. ఇల్లు అద్దెకిచ్చేశాను. మా ఫ్రెండ్‌తో అన్నీ మాట్లాడేశాను'' అన్నారు. ఆ మాట నాకు ఊపిరి పోసినట్లయింది. 'స్వంత ఇంటి కష్టాలు' వదిలించుకుని మనశ్శాంతిగా అద్దె ఇంట్లోకి అడుగుపెట్టాము.